డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్



ఆరు జిల్లాలకు లేని పూర్తిస్థాయి డీఈవోలు

అందరూ ఇన్‌చార్జ్‌లే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాశాఖ పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. అస్తవ్యస్థ పరిస్థితి నెలకొన్నది. విద్యార్థులను విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత కలిగిన విద్యాశాఖకే దిక్కులేని పరిస్థితి. చాలా ఏళ్లుగా రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జిలతోనే కూనారిల్లుతున్న ఈ శాఖలో పరిపాలన కొరవడి, పర్యవేక్షణ కుంటుపడి పూర్తిగా గాడి తప్పింది. ఏం జరుగుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏ ప్రభుత్వ శాఖలోనైనా కీలక పదవుల్లో ఒకరిద్దరు ఇన్‌చార్జిలు ఉంటారు. అదేమిటోగానీ.. విద్యాశాఖలో మాత్రం అంతా ఇన్‌చార్జిలే రాజ్యమేలుతున్నారు. పైగా ఒక్కొక్కరికి రెండు మూడు బాధ్యతలు ఉన్నాయి. వీరంతా అసలు ఉద్యోగం వదిలేసి కొసరు కొలువుల్లో కొనసాగుతున్నారు. ఫలితంగా విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అంతకంతకూ పడిపోతోంది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చదువులు సట్టుబండలయ్యాయి. బళ్లు కడకండ్ల పాలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా శాఖ దుస్థితిపై ప్రత్యేక కథనం..

- డిప్యూటీ డీఈవోలు అసలే లేరు
- రెగ్యులర్ ఎంఈవో ఒక్కరే..
- అన్ని మండలాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు
- 70 శాతం స్కూళ్ల హెచ్‌ఎంలూ వారే
- ఉమ్మడి జిల్లాలో 2,500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న చదువులు.. గాడితప్పిన విద్యాశాఖ

హనుమకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఇన్‌చార్జ్‌ల పాలనలోనే కొనసాగుతోంది. డీఈవోలు, ఎంఈవోలు, ఆఖరికి హెచ్‌ఎంలు కూడా ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. డిప్యూటీ డీఈవోలు అసలే లేరు. డైట్ కాలేజీకి కూడా పూర్తికాలపు ప్రిన్సిపాల్ లేడు. బీఈడీ కాలేజీకి ప్రిన్సిపాల్ ఉన్నా ఆయనకు అదనపు బాధ్యతను అంటగట్టారు. దీనితో ఉన్నవారిపై అదనపు పనిభారం పడి పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీనితో ప్రభుత్వపాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చదువులు చెప్పే గురువులు లేక విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోగా సర్కార్ బళ్ల క్రమంగా మూతపడుతున్నాయి.

ఉపాధ్యాయుల కొరత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2500 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5.50లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 90 శాతం పాఠశాలలకు రెగ్యులర్ హెడ్ మాస్టర్లు లేరు. పాఠశాలల్లో పని చేసే సీనియర్ అధ్యాపకులకే హెడ్‌మాస్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. దీనితో వారు ఎప్పు డు వస్తారో ? ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని సర్కార్ బళ్లను ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2500లకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల నియామకానికి పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డీఎస్‌సీని నిర్వహిం చలేదు. ఇటీవల డీఎస్‌సీ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినా అందులో ఉమ్మడి జిల్లాలో చూపిన టీచర్ పోస్టులు 560 మాత్రమే. టీఎస్‌పీఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీతో ఈ నియామక ప్రక్రియ కూడా అటకెక్కింది. గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్న తులు లేవు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం తగ్గుతుండడానికి, సర్కార్ బళ్ల మూతబడానికి ఇది కారణమౌతోంది.

డిప్యూటీ డీవోలు లేరు..

డీఈవోలుసరే ఎలాగూ లేరు. కనీసం డిప్యూటీ డీఈవోలు అయిన ఉన్నారా.. అంటే ఒక్కరు కూడా లేరు. ఉన్న ఒక్క డిప్యూటీ డీఈవో వాసంతికి డీఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా లేకుండాపోయారు. ఇదివరకు వరంగల్, జనగామ, మహబూబాబాద్ డివిజన్లలకు ఒక్కొక్కరు చొప్పున డిప్యూటీ డీఈవోలు ఉండేవారు. వారంతా రిటైర్ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారేవరూ రాలేదు. ఆ పోస్టులన్నీ అలాగే ఖాళీగా ఉండిపోయాయి.

ఒకే ఒక్క ఎంఈవో

ఉమ్మడి జిల్లా పరిధిలో 75 మండలాలుండగా మండలానికో విద్యాశాఖాధికారి (ఎంఈవో) విధిగా ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకే ఒక్క ఎంఈవో

మిగతా 7వ పేజీలో..

ఇన్‌చార్జ్ డీఈవోలు

- హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో)లు చాలా కాలం నుంచి లేరు.
- హనుమకొండ జిల్లాకు ప్రస్తుతం డీఈవో ఉన్న అబ్దుల్‌హై ఇన్‌చార్జే. వాస్తవంగా ఆయన బీఈడీ కాలేజీలో లెక్చరర్. ఆ కాలేజీకి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దీనితో పాటు ఆయనకు డీఈవో బాధ్యతలను కూడా అప్పగించారు.
- వరంగల్ జిల్లాకు కూడా రెగ్యులర్ డీఈవో లేడు. ఇన్‌చార్జ్ డీఈవోతోనే నాలుగేళ్లుగా నెట్టుకువస్తున్నారు. ఆరు జిల్లాల్లో ఒకే ఒక్క డిప్యూటీ డీఈవోగా ఉన్న వాసంతిని వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ డీఈవోగా కొనసాగుతున్నారు.
- జనగామ డీఈవో రాము ఇన్‌చార్జే. ఆయన రెగ్యులర్ పోస్టు విద్యాశాఖ (హైదరాబాద్)లో అడిషనల్ డైరెక్టర్. రెండేళ్ల కిందట జనగామ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అంటగట్టారు. దీంతో ఆయన జోడుగుర్రాల స్వారీ చేస్తున్నారు. ఇక్కడ ఒక రోజు, అక్కడ ఒక రోజు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అదనపు డైరెక్టర్ అయిన రామారావుకు ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడాదిగా ఆయన అక్కడా.. ఇక్కడా రెండు పడవలపై కాళ్లపెట్టి ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు.
- ములుగు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే దిక్కయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న పాణికి ఇక్కడ విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే కొనసాగుతున్నారు. అడిషనల్ డైరెక్టర్ అయిన రాంకుమార్ ఈ అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

ఎన్నికల విధులకు సంసిద్ధం కావాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్
- నోడల్ అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు నోడల్ అధికారులు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో శనివారం వచ్చే పార్లమెంట్ ఎన్నికల విధులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల విధులపై భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విడుదల చేసిందని, వాటిని నోడల్ అధికారులకు పంపించడం జరిగిందన్నారు. పోలింగ్ విధులకు కావాల్సిన సిబ్బంది వివరాలతో నివేదికను రూపొందించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు జిల్లాలో 12 మంది మాస్టర్ ట్రైనర్లు ఉన్నారని చెప్పారు. మహబూబాబాద్ నియోజకవర్గానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డోర్నకల్ నియోజకవర్గానికి సంబంధించి మరిపెడ మోడల్ స్కూల్‌లో శిక్షణ తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సమావేశం నిర్వహించామని, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు టీంలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సరిపోను ఈవీఎంలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులకు కావాల్సిన వాహనాలను సిద్ధం చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ అధికారులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జడ్పీ సీఈవో రమాదేవి, డీఆర్‌డీఏ పురుషోత్తం పాల్గొన్నారు.

స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన శ్రీపాదరావు

స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన మహనీయులు శ్రీపాదరావు అని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ కొనియాడారు. కలెక్టరేట్‌లో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిబద్ధతకు మారుపేరుగా స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన మహనీయులు శ్రీపాదరావు అందరికి ఆదర్శనీయమన్నారు. సర్పంచ్‌గా ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచెలుగా మహోన్నతమైన స్పీకర్ పదవిని అధిష్ఠించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, కలెక్టరేట్ ఏవో వెంకటరమణ పాల్గొన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చిన కేసీఆర్

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి, మార్చి 2: మిగులు తెలంగాణను పదేళ్లలో కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. దంతాలపల్లి మండలకేంద్రంలో శనివారం ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన గ్యారంటీల్లో భాగంగా ఉచిత విద్యుత్(జీరో బిల్లు)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలో ఆరు గ్యారంటీ హామీల అమలును పూర్తి చేస్తామన్నారు. తెల్లకార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రారంభించామన్నారు. డోర్నకల్ ప్రజలు సేవ చేసే భాగ్యాన్ని తనకు కల్పించారని, అందుకు నిత్యం వారి సేవలో ఉంటానన్నారు. పలు సంక్షేమ పథకాలను పల్లెల్లో విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. త్వరలో తెల్లరేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. మే నెలలో తిరిగి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు డీఈ, ఏడీఈ, ఏఈ పాండునాయక్, జహుర్‌పాషా, ఎంపీవో అప్సరపాషా, సిబ్బంది విజయ్, సురేష్, మధు పాల్గొన్నారు.

గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట: ప్రజలు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని పడమటిగూడెంలో శనివారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించి పలువురు లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి నెలలో 200 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. తొర్రూర్ సబ్ డివిజన్‌లో 63వేల విద్యుత్ కలెక్షన్లకు గాను 49వేల మంది గృహజ్యోతి లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. మండలంలో 4,300 విద్యుత్ కలెక్షన్లకు 2,632 ఈ పథకానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దస్రూనాయక్, సతీష్, చల్ల మధుకర్‌రెడ్డి, డీఈ మధుసూదన్ ఏఈ పాండునాయక్ పాల్గొన్నారు.



దంతాలపల్లిలో జీరో విద్యుత్ బిల్లును అందిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యం

- మూడు నెలల్లోనే మెగా డీఎస్సీకి నోటిఫికేషన్
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 2 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చిన దరిమిలా మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం సంబురాలు జరిపారు. బాణసంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పకుండా నాలుగు గ్యారంటీలను అమలు చేస్తున్నారని తద్వారా అనేక మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. తెలంగాణ సిద్ధించాక పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ సర్కార్ ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోపే మెగా డీఎస్సీ వేసి టీచర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని శాఖల్లో భర్తీల ప్రక్రియకు శ్రీకారం చుట్టనుందని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో శంతన్ రామరాజు, కమ్మగాని కృష్ణమూర్తి, రావిశెట్టి చంద్రశేఖర్, ఎడ్ల రమేష్, గోనె శ్యాం, అంబటి మహేందర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, స్వామి నాయక్, ఫయాజ్, రాజమ్మ పాల్గొన్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్ సంబురాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కమలంలో.. వీడని ఉత్కంఠ

తొలి జాబితాలో ఓరుగల్లుకు దక్కని చోటు

- పార్లమెంట్ ఆశావహుల్లో టెన్షన్
- పార్టీలో చేరే వారి కోసమే వేచిచూస్తోందని ప్రచారం



వరంగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వస్తుందన్న వార్తల నేపథ్యంలో బీజేపీ శనివారం తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. అందులో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో కమలం టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఉత్కంఠ పెరుగుతోంది. దేశ వ్యాప్తంగా 195 మంది మందితో జాబితాను ప్రకటించగా.. అందులో రాష్ట్రంలో 9 స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. అయితే ఉమ్మడి వరంగల్‌లోని రెండు స్థానాలను పెండింగ్‌లో పెట్టడంతో టికెట్ ఎవరికి అనే చర్చ జరుగుతుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చే నేతల కోసమే పెండింగ్‌లో పెట్టారా? లేదంటే రాజకీయ, కుల సమీకరణల కోసం జాబితాలో చోటు దక్కలేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

తొలి విడతలో నిరాశే...

తొలి జాబితాలో రాష్ట్రంలోని ముగ్గురు సిట్టింగ్ ఎంపీలతోపాటు మరో ఆరుగురికి కొత్తగా అవకాశం కల్పించిన అధిష్ఠానం వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటికే వరంగల్ ఎంపీ స్థానం నుంచి డజను మందికి పైగా నేతలు టికెట్ రేసులో ఉన్నారు. అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగను వరంగల్ నుంచి పోటీ చేయించాలని సూచించినట్టు ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల్లో పోటీకి మంద కృష్ణ సుముఖంగా లేరని, మాజీ పోలీసు అధికారి కృష్ణప్రసాద్ పోటీ చేయబోతున్నారని ప్రచారం జరిగింది. వీరితో పాటు కీలకమైన నేతలు పలువురు టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. తొలి విడతలోనే వరంగల్ పార్లమెంట్‌పై అధిష్ఠానం తేలుస్తుందని భావించిన కాషాయ నేతలకు నిరాశే మిగిల్చింది. అలాగే మానుకోట అభ్యర్థిని కూడా బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. బీజేపీ రాష్ట్ర నాయకులు హుస్సేన్‌నాయక్, యాప సీతయ్యల్లో ఒకరికి టికెట్ ఖాయంగా బీజేపీ శ్రేణులు భావించాయి. రాష్ట్రంలో ఆదిలాబాద్, మహబూబాబాద్ ఎంపీ సీట్లే ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఆదివాసీలకు టికెట్ ఇస్తే, మహబూబాబాద్‌లో లంబాడా సామాజిక వర్గం నుంచి టికెట్ ఇస్తారనే చర్చ జరిగింది. అయితే ఆదిలాబాద్ బీజేపీ సిట్టింగ్ స్థానమైనప్పటికి తొలి జాబితాలో అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి తెలితేనే మహబూబాబాద్ సీటుపై ఎవరికి అనేది స్పష్టత

మిగతా 8వ పేజీలో..

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 2 : మహబూబాబాద్ జిల్లా నూతన ఎస్పీగా కె.సుధీర్‌రామ్‌నాథ్ శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్పీగా విధులు నిర్వహించిన సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్‌ను హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. మంచిర్యాల జిల్లా రామగుండం డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సుధీర్‌రామ్‌నాథ్ జిల్లా ఎస్పీగా పదోన్నతిపై వచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కె.సుధీర్‌రామ్‌నాథ్ ములుగు ఏఎస్పీగా, మంచి ర్యాల డీసీపీగా పనిచేశారు.

సదరం పత్రాలకు స్లాట్‌బుకింగ్

మహబూబాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సదరం ధ్రువీకరణ పత్రాల కోసం అర్హులైన వారు ఈ నెల 3 నుంచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్‌బుక్ చేసుకున్న దివ్యాంగులకు వైకల్య పరీక్షలను మార్చి 6, 20వ తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా 13, 27 తేదీల్లో రెన్యువల్స్‌కు స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందాల్సిన వారు ముందుగా పీహెచ్‌సీలో వైద్యులచే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్ కోసం మీసేవ కేంద్రాల్లో చార్జి కింద రూ.35 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

యూబీఐ రిటేల్ - ఎక్స్‌పో ప్రారంభం


మాట్లాడుతున్న పాలగుల సత్యం

వడ్డెపల్లి, మార్చి 2: హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి (కుడా) గ్రౌండ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిటేల్ - ఎక్స్‌పోను యూబీఐ రీజినల్ హెడ్ పాలగుల సత్యం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో అతి తక్కువ వడ్డీతో గృహ, వాహన, విద్యా రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 14పైగా కార్లకు సంబంధించిన కంపెనీలు, 30కి పైగా బిల్డర్లు, సోలార్‌కు సంబంధించిన సప్లయర్లు పాల్గొన్నారు. రుణాలు పొందిన వారికి పాలగుల సత్యం మంజూరు పత్రాలను అందజేశారు. యూబీఐ అధికారులు నాంపెల్లి శ్రీనివాస్, రంగయ్యనాయుడు, సర్వేష్‌నాగార్జు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్- 1 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీలోగా తమ దరఖాస్తులను హనుమకొండ లష్కర్ బజార్‌లోని స్టడీ సర్కిల్ నేరుగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి కార్యాలయంలో 6న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, మార్చి 2: ఈ నెల 6వ తేదీన హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే, వరంగల్ హనుమకొండ కంపెనీలో 40 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 25 యేళ్ల వయస్సుగల నిరుద్యోగ యువకులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 సంప్రదించాలని తెలిపారు.



జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ రామన్

సందడిగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

10 రాష్ట్రాల నుంచి 200 క్రీడాకారులు హాజరు

ఈనెల 8 వరకు పండుగ వాతావరణంలో క్రీడలు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 2: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ మెన్ టెన్నిస్ టోర్నమెంట్ సందడిగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ సుబేదారిలో వరంగల్ అఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ రామన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహపూర్వక సంబంధాలు పెంపొందిస్తాయన్నారు. హనుమకొండ వేదికగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు.

వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి, క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ఎం.రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఓపెన్ టూ ఆల్ మెన్ విభాగంలో నిర్వహించనున్న టెన్నిస్ పోటీల్లో 10 రాష్ట్రాల నుంచి 70 సింగిల్స్ జట్లు, 33 డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఈనెల 8 వరకు నాకౌట్ పద్ధతిన పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో గెలిచిన క్రీడాకారులకు రూ.లక్ష పారితోషికాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, కార్యదర్శి ఏవీ ఎలమురుగు, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, వరంగల్ అఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రవిందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కన్నారెడ్డితో పాటు కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇంతింతై.. కళలకు సొంతమై!

● స్వర్ణోత్సవ సంబరాలకు భారతీయ నాటక కళా సమితి సిద్ధం ● నేటినుంచి 8 తేదీ వరకు ఉభయ రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 2: భారతీయ నాటక కళా సమితిలో స్వర్ణోత్సవ సందడి నెలకొంది. శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాలు ప్రజలకు ఎంతో అలరించనున్నాయి. నాటి కళలకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళాసమితి నిలువగా, అర్ధ శతాబ్దంలోకి అడుగు పెట్టడం కళాసమితి సభ్యులకు ఆనందాన్ని తెస్తోంది. నిర్వాహకుల అంకిత భావం, కళల పట్ల వారికి ఉన్న ఆరాధనతో భారతీయ నాటక కళా సమితి కళాభిమానుల మనసులను దోచుకుంటోంది. ఒకే మాట, ఒకే బాటగా భారతీయ నాటక కళా సమితి 49 వసంతాలు పూర్తి చేసుకోనుంది. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొంది నాటక రంగానికి చేస్తున్న సేవలతో అందరి అభిమానాలు చూరగొంటోంది. 1974లో వర్ధన్నపేట మండలం ఇల్లందలో దివంగత ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల ఆంజనేయులు, మల్లారి రంగయ్య, పోశాల సూర్యనారాయణ, దివంగత సిరివోలు వెంకట్రామరావు, వనం లక్ష్మీకాంతరావు, వడ్లకొండ ఎల్లగౌడ్ తదితరులు భారతీయ నాటక కళాసమితికి బీజం వేశారు.

అల్లూరి స్ఫూర్తితో..

1980లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద నుంచి ఆనాటి తాలుకా కేంద్రమైన వర్ధన్నపేటకు మారింది. ప్రారంభంలో అనేక ఒడిదుడుకులకు లోనైనా కమిటీ సభ్యులు లక్ష్యసాధనే ధ్యేయంగా భావించి అప్పట్లో నిర్ధిష్టమైన స్థలం, ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో నాటిక పోటీలకు తీవ్ర అవరోధాలు ఏర్పడేవి. ఈ ఇబ్బందులను శాశ్వతంగా అధిగమించాలనే ధృడ సంకల్పం వారిలో పెరిగింది. వడ్లకొండ ఎల్లగౌడ్ దర్శకత్వంలో స్థానిక కళాకారులతో అల్లూరి సీతారామరాజు నాటికను ప్రదర్శించి దాతల ద్వారా విరాళాలు సేకరించారు. అలా అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శనతో సేకరించిన డబ్బుతో స్థల సేకరణ చేయాలనే ఆలోచన కలిగింది.

ఐదు రోజుల పాటు..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే నాటక పోటీలు పట్టణంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నాటక పోటీల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఐదు రోజులు పూర్తి నాటికలు వేసి, శివరాత్రిన ఇతర కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేస్తారు. 3న మొదటి ప్రదర్శన తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత, కళానికేతన్, వీరన్నపాలెం వారి ఆధ్వర్యంలో రాజుగారి గోచి, 4న కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైలే రాజు, చైతన్య కళాభారతి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం, 5న సిరిసిరిమువ్వ కల్చరల్ అసోయేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో హక్కు, మురళీ కళానిలయం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అవ్వా అప్పచ్చి, 6న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మూల్యం, మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బంధం, 7న అభినయ ఆర్ట్స్ గుంటూరి వారి ఆధ్వర్యంలో ఇంద్రప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ఆధ్వర్యంలో కౌసల్యా సుప్రజా రామా, 8న శివ రాత్రి పండుగ సందర్భంగా పలు కల్చరర్ ప్రోగ్రామ్స్, విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.

కలగానే జాతీయస్థాయి పోటీలు

గతంలో నాటిక కళా సమితి కమిటీ సభ్యులు ఎంతో కృషిచేసి నాటకాలను రాష్ట్రస్థాయికి చేరేలా కృషిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కళాకారులతో పాటు తమిళనాడు, చెన్నై రాష్ట్రాలకు చెందిన కళాకారులను తీసుకువచ్చి నాటికలు ప్రదర్శింప చేశారు. సినీ రంగంలో మంచి స్థానాల్లో ఉన్న క్యారెక్టర్ ఆర్టిస్టులను సైతం తీసుకువచ్చారు. కానీ, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మాత్రమే ఎక్కువ శాతం నాటికలు ప్రదర్శించే వారు వస్తున్నారు. దీంతో భారతీయ నాటిక పోటీలు ఇంకా రాష్ట్రస్థాయిలో ఉండిపోయాయి. ఇక జాతీయస్థాయిలో పోటీలు కలగానే మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయా అంటూ ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. దీనికి గతంలో విమర్శలు రావడంతో ఇప్పటి ఆహ్వాన పత్రికలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పోటీలని ముద్రించి చేతులు దులుపుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైతం కళా సమితి ముందుకు వెళ్తే ఆదరణ బాగుంటుందని సూచిస్తున్నారు.

కమిటీలో సమన్వయ లోపం

భారతీయ నాటిక కళా సమితి కమిటీ సభ్యుల మధ్య సమన్వయం లోపించింది. గత నెల రోజుల నుంచి కార్యక్రమాలపై సమావేశాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ దాతలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందించడంలో విఫలమయ్యారు. ఈ నెల 3వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతుండగా, రాత్రి వరకు ఆహ్వాన పత్రికలు పంచుతునే ఉండడం పట్ల విమర్శలకు గురవుతున్నారు. ఆహ్వాన పత్రికలో పలువురి పేర్లను సైతం తప్పుగా ముద్రించడం పట్ల దాతలు అసహనానికి గురయ్యారు. ఇక ఈ సారి భారీగానే విరాళాలు వసూలు చేసినట్లు తెలుస్తోంది?. మూలధన ఏర్పాటులో భాగంగా దాదాపు రూ.25 లక్షల వరకు కొత్తగా విరాళాలు సేకరించగా, ఆహ్వాన పత్రిక అడ్వటైజ్‌మెంట్ల ద్వారా రూ.3లక్షల వరకు సేకరించారు. గతేడాది కమిటీ సభ్యుల మధ్య విరాళాల సేకరణ, ఖర్చుల పద్దుల్లో కొంత పంచాయతీ ఏర్పడగా అంతర్గతంగా పరిష్కరించుకున్నారు. గతేడాది కార్యక్రమాల్లో స్టేజీ మీదకు పిలిచే సందర్భంలోనూ అతిథులు కమిటీ సభ్యులకు చివాట్లు పెట్టారు. మళ్లీ ఇవన్నీ పునరావృతం కాకుండా సభ్యులు చూసుకుంటూ సమన్వయంగా పని చేయాలని ప్రేక్షకులు ఆశిస్తున్నారు.



వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో సాగుతున్న పనులు

పార్కింగ్‌కు అడ్డాగా కళా సమితి ప్రాంగణం

గతంలో శివరాత్రి సందర్భంగా నాటికల కోసం ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ నిధులతో సైతం భారీగా షెడ్డు వేసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఫంక్షన్లు చేసుకునేందుకు మినీ ఫంక్షన్ హాల్‌గా వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమాలు ముగియగానే ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోవడంతో కళా ప్రాంగణం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతోంది. దీనికి తోడు పక్కనే సినియా థియేటర్ ఉండడంతో ఎంచక్కా ఆ యాజమాన్యం సినిమాలకు వచ్చే ప్రేక్షకుల వాహనాలు ప్రాంగణంలో ఉంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేసుకుంటున్నారు. ఇవన్నీ స్థానికంగా ఉన్న కమిటీ సభ్యులకు తెలిసినప్పటికీ వాటిపై దృష్టి సారించడంలేదు. నాటిక పోటీలు జరిగినప్పుడు ఊకదంపుడు ఉపన్యాస్యాలు ఇస్తున్న కమిటీ సభ్యులు కళలను ఆదరిస్తున్న ప్రజలకు పరోక్షంగా కళా ప్రాంగణం సహాయ పడే విధంగా చేయాలని కోరుతున్నారు.

నాటి కళలను కాపాడుకుంటాం : పెద్దూరి సంజీవరావు, కల్చరర్ సెక్రటరీ

నాటి కళలను కాపాడుకోవాలనే లక్ష్యంతో భారతీయ నాటకాలను క్రమం తప్పకుండా చేస్తున్నాం. దివంగత ఈగ శ్రీహరి ఆశయాలను కొనసాగించడంతో పాటు కళాసమితిని స్థాపించిన ప్రతీ ఒక్కరి నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్నాం. కమిటీ సహాయ సహకారాలు, ప్రజల పూర్తి సహకారం, ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో మరింత విజయవంతంగా నాటిక ప్రదర్శనలు పూర్తి చేస్తాం.

అందరూ ఇన్‌చార్జ్‌లే..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఆయన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న రవీందర్. మిగతా మండలాల్లో సుదీర్ఘంగా సీనియర్ హెడ్‌మాస్టర్లే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. సీనియర్ హెడ్‌మాస్టర్లకే ఈ బాధ్యతలు అప్పగించారు. వారు తమ రెగ్యులర్ హెచ్ఎం బాధ్యతలు చూసుకుంటూనే ఇటు ఎంఈవో విధులను కూడా నిర్వహించడానికి సతమతమవుతున్నారు. ఈ క్రమంలో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. గతంలో ప్రతీ మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. అనేక మంది రిటైర్ కావడం, కొందరు మృతి చెందడం, ఎంఈవోలుగా పదోన్నతులు లేకపోవడం, కొత్త నియామకాలు చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల అసలు ఎంఈవోలే లేకుండా పోయారు. మండల పరిధిలోని ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎంఈవోలదే కీలక భూమిక. పూర్తికాలపు ఎంఈవోలే లేకపోవడంతో సర్కార్ బళ్ల తీరు రాజు లేని రాజ్యం అయింది.

హెడ్‌మాస్టర్లు

ఏ పాఠశాల అయినా సక్రమంగా నడవాలన్నా, విద్యార్థుల చదువులు సక్కగా సాగాలన్నా, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నా హెడ్‌మాస్టర్లే కీలకం. ఉపాధ్యాయులను నియంత్రణలో పెట్టి విద్యాబోధన సరిగా జరిగేట్టు చూసే బాధ్యత హెచ్‌ఎంలది. అటువంటి వారే ఇన్‌చార్జిలుగా ఉంటే ఇక బడులు నడిచేదెలా? సదువులు సాగెదెలా? అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రిన్సిపాళ్లూ ఇన్‌చార్జిలే..

ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే బీఈడీ, డైట్ కళాశాలలకు సైతం పూర్తి కాలపు ప్రిన్సిపాళ్లు లేరు. హనుమకొండలోని డైట్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నారాయణరెడ్డి ఉన్నారు. ఆయనకు యాదాద్రి జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. రెండు బాధ్యతలను ఆయన చూసుకోలేక సతమతమవుతున్నారు. ఇక్కడ కొద్ది రోజులు, అక్కడ కొద్ది రోజులు విధులు నిర్వహిస్తూ ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేరు. ఇదే కాలేజీలో లెక్చరర్ అయిన అబ్దుల్‌హై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. అంతటితో సరిపోదన్నట్టు హనుమండ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలను అప్పగించారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇన్‌చార్జి డీఈవోలు, ఎంఈవోల కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయ పాలన పాటించకపోవడం, తర్వాత పాఠశాలలకు వచ్చాక సంతకాలు పెట్టడం, విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత పనులపై బయట తిరగడం, ఉపాధ్యాయుల మధ్య విభేదాలు వంటివి చోటుచేసుకుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించొద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు పనిభారం పేరుతో పలువురు ఉపాధ్యాయులను ఆఫీసు పనుల కోసం కార్యాలయాలకు రప్పించుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే అలుసుగా మరికొందరు ఉపాధ్యాయులు ఆఫీసు పని పేరు చెప్పుకొని సొంత పనులు చేసుకుంటున్నారని సమాచారం. దీంతో విద్యార్థులకు బోధన సరిగా అందడం లేదు. డీఈవోలు, ఎంఈవోలు అంతా ఇన్‌చార్జిలు కావడంతో విధుల నిర్వహణలో జవాబుదారీతనం కొరవడుతోంది. ఒకటికన్నా మించి అదనపు బాధ్యతలను అప్పగించడంవల్ల వారు దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి.

మూడోరోజు మేడారం హుండీల లెక్కింపు

ఆదాయం రూ 3.46 కోట్లు



హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని టిటిడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు కొనసాగుతోంది. శనివారం మూడోరోజు 112 హుండీలను లెక్కించగా రూ 3,46,61,000 ఆదాయం సమకూరినట్టు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో మూడు రోజులుగా నిర్వహించిన హుండీ లెక్కింపుతో మొత్తం రూ.9,60,36,000 సమకూరింది. మొత్తం 317 హుండీలను లెక్కిం చడం పూర్తయింది. మొదటి రోజు రూ.3,15,40,000, రెండోరోజు రూ. 2,98,35,000 కోట్లు ఆదాయం సమకూరింది. ఇంకా 201 హుండీలను లెక్కిం చాల్సి ఉంది. వచ్చే రెండు రోజుల్లో వీటిని లెక్కించడం పూర్తి చేస్తారు. మేడారం జాతరలో మొత్తం 518 హుండీలను ఏర్పాటు చేశారు. వీటిలో ఇనుప హుండీలు 482, క్లాత్ హుండీలు 34, బియ్యం హుండీలు. లెక్కించిన హుండీ ఆదాయాన్ని వెంట వెంటనే బ్యాంకులో జమ చేస్తున్నారు. హుండీల్లో ఇండియన్ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ పెద్ద మొత్తంలో బయటపడుతోంది. దీనితో పాటు వెండి, బంగారు కానుకలు కూడా కంటపడుతున్నాయి. నాణాలు, బియ్యం పెద్దమొత్తంలో పోగవుతున్నాయి. నాణాలను చివరి రోజున తూకం వేయడం ద్వారా లెక్కిస్తారు. బియ్యాన్ని బస్తాల్లో నింపు నిలువ చేస్తున్నారు. లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం వల్ల హుండీల లెక్కింపు త్వరితగతిన సాగుతోంది.

వీరభద్రస్వామి ఆదాయం రూ.25.92 లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కురవి, మార్చి 2 : కురవిలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ ఆదాయం హుండీల ద్వారా రూ.25,92,746 లభించినట్లు ఈవో సత్యనారాయణ తెలిపారు. ఆలయంలో శనివారం నిర్వహించిన లెక్కింపులో వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ.19,26,460, భద్రకాళి అమ్మవారి హుండీ ద్వారా రూ.6,66,286 లభించినట్లు ఈవో పేర్కొన్నారు. ఈ లెక్కింపును ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కవిత పర్యవేక్షించారు.

రైల్వే గేటు నుంచి రాకపోకలు పునరుద్ధరణ

గార్ల, మార్చి 2 : మూడవ రైల్వే లైను పనుల్లో భాగంగా గార్ల-డోర్నకల్ మధ్య గల రైల్వేగేటును రైల్వే అధికారులు గత నెల 14న మూసివేశారు. ఈ ప్రాంతంలో మూడవ లైను పనులు పూర్తి కావడంతో నిబంధనలు ఎత్తివేసి గేటును తెరవడంతో శనివారం వాహనదారులు రాకపోకలను ప్రారంభించారు. 16 రోజుల పాటు రైల్వేగేటు మూసివేయడంతో ఖమ్మం, డోర్నకల్ వెళ్లే ప్రయాణికులు బుద్దారం, పుల్లూరు నుంచి వెళ్లడంతో రోడ్లు బాగాలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

శివారు కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్‌టౌన్, మార్చి 2: పట్టణ శివారులోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని నున్నా నారాయణనగర్‌లో శనివారం సీపీఎం బృందం పర్యటించింది. తాగునీటి సమస్యను డీఈ ఉపేందర్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి కాలనీలో పర్యటించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పంజాల ఉపేంద్ర, జంగా కళావతి, అనిత, అనూష, రహీం, సైదులు పాల్గొన్నారు.

6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



గూడూరు సనాతన శివాలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గూడూరు, మార్చి 2: గూడూరులోని సనాతన శివాలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ ఛైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం శివాలయం ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకతీయుల కాలంలో నిర్మించిన సనాతన శివాలయంలో శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇది దక్షిణ భారతదేశంలోనే అరుదైన సనాతన శివాలయంగా పేరు గావించిందన్నారు. 6 నుంచి 8 వరకు జరిగే ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, శివ, సాగర్, సోమశేఖర్, అయిలయ్య, నవీన్, మల్లేష్, చంటి స్వామి, శ్రీనివాస్, విజయ్, యుగేందర్, రాజు, శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 2: రాష్ట్రంలో రెండవ విడత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకుడు కోడి మురళీయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మురళీయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 80వేల మంది ఒక్కొక్కరు రూ.43,750 చొప్పున గొర్రెల కోసం డీడీలు తీశారన్నారు. సంవత్సరం గడుస్తున్నప్పటికి గొర్రెలు పంపిణీ చేయకపోవడం వల్ల గొల్లకురుమలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి వీరన్న, మానక శ్రీను, మహేష్ కోడి శ్రీను, అంజయ్య రామన్న, రామచంద్రు, చిన్న లింగయ్య, అనిల్ పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

నెల్లికుదురు, మార్చి 2: మండల కేంద్రంలో ఆకేరు వాగు ఉధృతికి పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం అందజేయాలని రామన్నగూడెం రైతులు షైన రాములు, కొంతం అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. నెల్లికుదురులో శనివారం వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఆకేరు వాగు పొంగి పొర్లడంతో ఆకేరు వాగు ఒడ్డు వ్యవసాయ భూములు కోతకు గురై 50 ఎకరాలు కొట్టుకు పోయాయన్నారు. అధికారులు కోతకు గురైన భూములను సర్వే చేసినా పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో రైతులు సోమయ్య, శ్రీను, వెంకటయ్య, నర్సయ్య రాములు, సాయిలు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం



కలెక్టరేట్‌లో తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 2 : సమాజాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో శనివారం తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో అర్హులకు చేరవేసేది ఉద్యోగులేనని అన్నారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ... క్రిమిలేయర్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీ ఉద్యోగుల హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో గునిగంటి శ్రీను, స్వప్న, శివప్రసాద్, రాజేందర్, నాగరాజు, సునిత, రఫిక్, కుమార్, మంజుభార్గవి, మహిపాల్, ప్రభావతి, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

గార్ల, మార్చి 2: గార్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ బజార్‌కు చెందిన షేక్ షాహిదా అనే మహిళ ఇంట్లో వారం రోజుల క్రితం జారి పడడంతో తలకు బలమైన గాయం కాగా, హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. రోజుకు రూ.లక్ష ఖర్చు అవుతుండగా కుటుంబ సభ్యులు వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతుండడంతో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఆస్పత్రికి మంజూరు చేయించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్ నాయుడు, షేక్ యాకుబ్ పాషా, బోడ శ్రీకాంత్ హైదరాబాద్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్‌వోసీ బాండు మంజూరి చేయించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్‌కు షాహిదా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీ రుణాలను విడుదల చేయాలి

▸▸ ఎస్సీ కార్పొరేషన్ జీఎంకు దళిత సంఘాల విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, మార్చి 2 : ఎస్సీ కార్పొరేషన్‌లో 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ రుణాలను తక్షణమే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర ఎల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్‌కు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ 2018 నుంచి 2021 వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్ల నుంచి రుణాలు విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ పెండింగ్ సబ్సిడీ రుణాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శాంతికిరణ్, మనోజ్, ఉపేందర్, బాలరాజు, రంజిత్, చంటి సుగుణమ్మ, పుల్లయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

కష్టజీవులకు తప్పని తిప్పలు

▸▸ తొర్రూరుకు మార్చడంతో ఇబ్బందులు

▸▸ మానుకోట పరిధికి తరలించాలని డిమాండ్

▸▸ కేసముద్రం మండలంలో 5వేల మంది కార్మికులు

32 కి.మీల దూరంలో కార్మిక శాఖ కార్యాలయం

కేసముద్రం, మార్చి 2 : కార్మికుల సంక్షేమాన్ని గత పాలకులు గాలికి వదిలేశారు. కొత్త జిల్లా ఏర్పడితే కార్యాలయాలు మరింత దగ్గర అవుతాయని అందరూ భావిస్తారు. ఇందుకు భిన్నంగా 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయాన్ని 32 కిలోమీటర్ల దూరంలోని తొర్రూరు పట్టణానికి మార్చి కష్టజీవులను వ్యయ ప్రయాసాలకు గురిచేస్తుండడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో కార్మిక శాఖ పరిధిలో మహబూబాబాద్, తొర్రూరు డివిజన్ కేంద్రాల్లో సహాయ కార్మిక శాఖాధికారి (ఏఎల్‌వో) కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా ఏర్పడక ముందు గూడూరు, కొత్తగూడ మండలాలు నర్సంపేట ఏఎల్‌వో పరిధిలో ఉండగా, బయ్యారం, గార్ల మండలాలు ఇల్లందు ఏఎల్‌వో పరిధిలో ఉన్నాయి. 2016లో మహబూబాబాద్ జిల్లా ఏర్పాటు అనంతరం కార్మిక శాఖలో మండలాల విభజనను చేశారు. మహబూబాబాద్ ఏఎల్‌వో కార్యాలయ పరిధిలో మహబూబాబాద్, గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం, గార్ల, డోర్నకల్, కురవి మండలాలు, తొర్రూరు ఏఎల్‌వో పరిధిలో తొర్రూరు, పెద్దవంగర, కేసముద్రం, నెల్లికుదురు, నర్సింహులపేట, దంతాలపల్లి, మరిపెడ, చిన్నగూడూరు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని సంఘటిత, అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ పథకాలను అమలు చేయడం ఏఎల్‌వో కార్యాలయాల విధి. కార్మికులకు ప్రమాదాలు జరిగిన సమయంలో వాటి పరిహారాన్ని పొందేందుకు ఏఎల్‌వో కార్యాలయాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

భవన నిర్మాణ కార్మికుల పథకాలివే..

రాష్ట్ర కార్మిక శాఖ నుంచి భవన, ఇతర నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించే పథకాలు అమలవుతున్నాయి. కార్మిక శాఖలో నమోదై ఉన్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.1 లక్ష పరిహారం ఇస్తారు. ఆస్పత్రి ఖర్చులను గరిష్ఠంగా నెలకు రూ.4500 చొప్పున, రోజుకు రూ.300 చొప్పున అందిస్తారు. అంత్యక్రియలకు రూ.30వేలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు, మహిళా కార్మికులకు ప్రసూతి అయితే రూ.30వేల సహాయాన్ని అందిస్తారు. కృత్రిమ అవయవాల కొనుగోలుకు నిధులను మంజూరు చేస్తారు. ఇవేకాకుండా కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున ఉపకార వేతనం ఇస్తూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు కాని వ్యక్తి పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.50వేలు, అంగవైకల్యానికి రూ.20వేలు పరిహారం ఇస్తారు. ఇవేకాకుండా తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంఘాలు, ట్రస్ట్‌లలో పనిచేస్తూ కార్మిక సంక్షేమ నిధికి జమ చేసే కార్మికులకు పథకాలు అమలు చేస్తున్నారు.



కేసముద్రం స్టేషన్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

పరిధి మార్పుతో వ్యయ ప్రయాసలు..

మహబూబాబాద్ జిల్లాలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మండలాన్ని మానుకోట ఏఎల్‌వో పరిధిలో నుంచి తొర్రూరు ఏఎల్‌వో పరిధిలోకి మార్చడం కార్మికులను వ్యయ ప్రయాసలకు గురిచేస్తోంది. కేసముద్రంలోని ప్రధాన కార్మిక సంఘాలకు అనుబంధంగా గుమాస్తాలు, హమాలీ వర్కర్స్, బండ్ల హమాలీలు, పసుపు డోలా, గ్రానైట్ క్వారీ, భవన నిర్మాణ కార్మికులు, ట్రాన్స్‌పోర్టు కార్మికులు, సివిల్ సప్లయిస్ హమాలీ, మిల్లు డ్రైవర్స్, పెయింటింగ్ వర్కర్స్, ట్రాక్టర్ డ్రైవర్స్, మధ్యాహ్నభోజన కార్మికులు, దడువాయి, అంగన్‌వాడీ, ఐకేపీ సీఏలు, ఏఎస్‌ఎంలు, ఆశా వర్కర్లు, రిక్షా, కిరాణా షాపులు, హోటళ్లలో పనిచేస్తున్న వారితో కార్మిక సంఘాలు ఉన్నాయి. వీరే కాకుండా ఉపాధి హామీ పథకం కూలీలు, బిహార్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు వెరసి 5వేలకు పైగా మంది కార్మికులు కేసముద్రం మండలంలో ఉన్నారు. వీరందరికీ కార్మిక శాఖ నుంచి సంక్షేమ పథకాలకు రావాల్సిన ప్రయోజనాలు, ప్రమాదాలకు అందాల్సిన పరిహారం పొందేందుకు ఏఎల్‌వో కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. తొర్రూరులోని కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లిరావడం కార్మికులను, వారి కుటుంబ సభ్యులను అనేక ఇబ్బందులకు గురిచేస్తోంది. 32 కిలోమీటర్ల దూరంతోపాటు కేసముద్రం నుంచి రవాణా సౌకర్యాలు సక్రమంగా లేని తొర్రూరుకు వెళ్లి వచ్చేందుకు ఒక రోజంతా సమయం పడుతోంది. ఇప్పటికైనా కేసముద్రం మండలాన్ని గతంలో ఉన్నట్లుగానే మహబూబాబాద్ ఏఎల్‌వో పరిధిలోకి మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలా వీలుకాని పక్షంలో తొర్రూరులోని ఏఎల్‌వో కార్యాలయాన్ని అధిక సంఖ్యలో కార్మికులతో పారిశ్రామిక కేంద్రంగా పేరున్న కేసముద్రానికి తరలించాలని, ఈ దిశగా కాంగ్రెస్ సర్కారు చొరవ తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.



కేసముద్రంలోనే ఏర్పాటు చేయాలి

కన్మంతరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇఫ్టూ మహబూబాబాద్ డివిజన్ అధ్యక్షుడు

వేలాది మంది కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న కార్మిక శాఖ కార్యాలయాన్ని తొర్రూరు నుంచి కేసముద్రంలో ఏర్పాటు చేయాలి. ఎన్నోమార్లు కోరినప్పటికీ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోవడం లేదు. తొర్రూరుకు వెళ్లేందుకు కార్మికులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. శాసనసభ గెజిట్ ద్వారా కార్యాలయాన్ని మార్చే వీలుంది. ఈ మేరకు శాసనసభ సభ్యులు చొరవ చూపాలి.



భవన నిర్మాణ కార్మికుల ఇబ్బందులు

ముల్కా మురళి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మండలాన్ని 18 కిలోమీటర్ల దూరంలోని మహబూబాబాద్ నుంచి వేరు చేసి 32 కిలోమీటర్ల దూరంలోని తొర్రూరు ఏఎల్‌వో కార్యాలయానికి కలపడం అనాలోచిత నిర్ణయం. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు పరిహారం కోసం దరఖాస్తు చేసేందుకు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. కేసముద్రంలోనే ఏఎల్‌వో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

ఓటరు జాబితాపై అఖిలపక్ష పార్టీల ప్రతినిధులతో సమావేశం

మహబూబాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ కలెక్టరేట్‌లో శనివారం అఖిలపక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ మాట్లాడుతూ ఓటర్లు అందించిన దరఖాస్తులను పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ముసాయిదా జాబితా రూపకల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై ఏమైనా అభిప్రాయాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. సమావేశంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎలక్షన్ తహసీల్దార్ పవన్‌కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు సురేష్‌నాయుడు, భరత్, దార్ల శివ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏపీసీ ప్రొడక్టివిటీ కోఆర్డినేటర్ నజీర్ సిద్దిక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 2 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని ఏపీసీ ప్రొడక్టివిటీ కో-ఆర్డినేటర్ నజీర్ సిద్దిక్ అన్నారు. మహబూబాబాద్‌లోని వేల్పుల సత్యంకాలనీలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మిక్స్‌డ్ సంస్థ సహకారంతో దైవకృప వెల్ఫేర్‌సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మగ్గం, జ్యూట్‌బ్యాగ్ టైలరింగ్, పెయింటింగ్ అండ్ డయింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన నజీర్ సిద్దిక్ మాట్లాడుతూ.. మహిళలు ఇలాంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి బాసటగా నిలవాలని సూచించారు. గత మూడేళ్లుగా దాదాపు 800 మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ బానోత్ వీరన్న, ఉప్పలయ్య, అరుణ్‌సండే, బానోత్ లోకేష్, కోటేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నజీర్ సిద్దిక్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, మార్చి 2 : మహబూబాబాద్ కొత్తబజారులోని పలు కాలనీల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్-2 ఏఈ నవ్యశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కొండపల్లి గోపాల్‌నగర్, ఎంపీ కార్యాలయం, కృష్ణకాలనీ, సిగ్నల్ కాలనీ, భద్రన్న కాలనీ, విక్రమ్‌నగర్, తాళ్లపూసపల్లి రోడ్డు, నందమూరినగర్, జగన్‌కాలనీ, ఇందిరానగర్ కాలనీ, లెనిన్‌నగర్ కాలనీ, మిల్ట్రీ కాలనీతో పాటు బీసీ కాలనీల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ నవ్యశ్రీ కోరారు.

సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తాం

▸▸ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, మార్చి 2: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరులోని 1వ వార్డు పరిధిలో గృహలక్ష్మి పథకం ద్వారా ఉచిత విద్యుత్ బిల్లులను శనివారం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపు నాలుగు గ్యారంటీలు అమలు చేసిందని, మరో రెండు గ్యారంటీలను అమలుచేసేందుకు సన్నద్ధమవుతుందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ రాంచంద్రయ్య, వైస్ ఛైర్మన్ సురేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ భూసాని రాము, పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం..

తొర్రూరురూరల్:నియోజకవర్గం అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని అమ్మాపురం, సోమారం, గుర్తూర్, జీకే తండా, జమస్థాన్‌పురం గ్రామాల్లో హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.



తొర్రూరులో గృహలక్ష్మి లబ్ధిదారులకు జీరో బిల్లు అందిస్తున్న ఎమ్మెల్యే

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతీ గ్రామంలో మహిళలకు చీరను అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసి ప్రజల ముందు నిలబెడుతామని చెప్పారు. ప్రతీ గడపకు ప్రభుత్వ పథకం అందించడం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, హనుమాండ్ల తిరుపతి రెడ్డి, నిరంజన్ రెడ్డి, మల్లేష్, అమ్మాపురం ఎంపీటీసీ ముద్దం విక్రమ్‌రెడ్డి, పెదగాని సోమన్న, మహిబూబ్‌రెడ్డి, అచ్చిరెడ్డి, ఆయా గ్రామాల అధ్యక్షులు జగన్, రంగయ్య, వీరస్వామి, రమేష్, ప్రజలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

కేసముద్రం, మార్చి 2: మండలంలోని నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాలలో శనివారం వన్యప్రాణుల సంరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు ఏనుగు, చిరుత, నక్క, సీతాకోక చిలుక, రామచిలుక, సింహం మాస్కులను ధరించి ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొడిపాక రమేష్, పెరుమాండ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నగూడూరు, మార్చి 2 : ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. నర్సింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి ఆకేరు నుంచి గుండంరాజుపల్లి మీదుగా మహబూబాబాద్‌కు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్రం

కేసముద్రం, మార్చి 2: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి హరించి వేస్తోందని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ ఆరోపించారు. కేసముద్రంలో శనివారం నిర్వహించిన ట్రాన్స్‌పోర్టు హమాలీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు హక్కులు లేకుండా చేసేందుకే ప్రభుత్వ సంస్థలను కేంద్రం ప్రైవేటీకరణ చేస్తోందని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల సహాయ కార్యదర్శి దాసరి లింగస్వామి, నల్గొండ వెంకన్న, మౌలానా, చంద్రయ్య, రమేష్, వెంకన్న, ఉప్పలయ్య, హుస్సేన్, రవి, యాకయ్య పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పెద్దవంగర, మార్చి 2 : సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ తమ్మెర లక్ష్మీనరసింహారావు, వేలూరి శారద అన్నారు. మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులతో కలిసి శనివారం అల్పాహారం వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు దామ్మెర సురేష్, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, ఎర్ర వెంకన్న, ఎం.శ్రీనివాస్, మల్లికార్జునచారి, అనపురం రవి, ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డి, సతీష్, రేణుక, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ జీఎం పర్యటన

మహబూబాబాద్ టౌన్, మార్చి 2 : జిల్లాలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, జనరల్ మేనేజర్ బి.ఆనంద్‌కుమార్ శనివారం పర్యటించారు. కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ రికార్డుల నవీకరణను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆర్థిక ఉపాధి పథకం ద్వారా మంజూరి అయిన యూనిట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీని నగదు బదిలీలా చేయాలి

తొర్రూరు, మార్చి 2 : రెండో విడత గొర్రెల పంపిణీని నగదు బదిలీలా చేయాలని కోరుతూ జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో 80వేల మంది గొల్లకురుమలు డీడీలు తీసి సంవత్సరం గడుస్తున్నా గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి గొర్రెల పంపిణీ చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, మహేష్‌నాగరాజు, రాజేష్‌కొమురయ్య, నరేష్, మణిదీప్‌పాల్గొన్నారు.

నేటి బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 2: ఖమ్మంలో ఈ నెల 3న జరిగే బహిరంగ సభకు విప్లవ శ్రేణులు, అభిమానులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మార్పులను గుర్తిస్తూ వాటికి అనుగుణమైన ఎత్తుగడలను రూపొందించడానికి ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. వర్గ పోరాటాలను తీవ్రతరం చేసే లక్ష్యంతోనే మూడు విప్లవ పార్టీలు కలిసి ఐక్యంగా సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో కొత్తపల్లి రవి, ప్రభాకర్, జగ్గన్న, ఎం.వీరన్న పాల్గొన్నారు.

కమలంలో వీడని ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

వస్తుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

ప్యారాచూట్ నేతల కోసమేనా..?

తొలి జాబితాలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులను బీజేపీ ప్రకటించకపోవడానికి మరో కారణం కూడా ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌కు చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు కుమారుడు భరత్‌కు సీట్లు ఖరారయ్యాయి. దీంతో వరంగల్ నుంచి పోటీ చేయాలని బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్‌ను వీడిన తరువాత బీజేపీలో టికెట్ ఇవ్వకపోతే ఎలా అనే ప్రశ్నలు ఆ మాజీ ఎమ్మెల్యే నుంచి బీజేపీ నేతలకు ఎదురయ్యాయి. దీంతో పార్టీలో చేరిన వారికి అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని.. జహీరాబాద్, నాగర్‌కర్నూల్ ఉదంతాన్ని చూపెడుతూ.. ఓ బీఆర్‌ఎస్ నేతను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. అలాగే మానుకోట నుంచి కూడా ఓ మాజీ ఎంపీతో పాటు కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే కూడా గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం ఉంది. వీరితో చర్చలు చివరి దశలో ఉండటంతో తొలి జాబితాలో అభ్యర్థిని ఖరారు చేయలేదని సమాచారం. మొత్తానికి ప్యారాచూట్ నేతల కోసం అధిష్ఠానం ఎదురుచూస్తుందనే ప్రచారంతో టికెట్ కోసం ఎన్నో ఆశలతో ఉన్న నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

కారు, ద్విచక్రవాహనం ఢీ

▸▸ ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



రంజిత్ (ఫైల్)

గూడూరు, మార్చి 2 : జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గూడూరు మండలంలోని మర్రిమిట్ట వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంఖానిపేట గ్రామానికి చెందిన కొమ్ము రంజిత్(24) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. తన స్నేహితుడైన షైదం రాజు మహబూబాబాద్‌లో రెడీమెడ్ షాపు నిర్వహిస్తున్నాడు. రంజిత్ తన స్నేహితుడి స్వగ్రామమైన కొమ్ములవంచకు వెళ్తున్నారు. ఈక్రమంలో మర్రిమిట్ట వద్ద జాతీయ రహదారిపై మహబూబాబాద్ వైపు నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొమ్ము రంజిత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. షైదం రాజుకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. రంజిత్‌కు తండ్రి యాకయ్య తల్లి మంగమ్మ ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్, మార్చి 2 : మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 16న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు సమావేశ హాల్‌లో శనివారం మాట్లాడుతూ జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు సరైన మార్గమని చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు తిరుపతిరావు, సురేష్, సీఐలు, కోర్టు పరిపాలన అధికారి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

- కేసముద్రం : మహబూబాబాద్‌లో ఈ నెల 16న నిర్వహించే లోక్ అదాలత్‌లో వివిధ కేసుల్లో ఉన్న ఇరువర్గాలు రాజీ కుదుర్చుకొని పరిష్కరించుకునే అవకాశం ఉందని రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. కేసముద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని కేసముద్రం, మహబూబాబాద్, కురవి మండలాల్లో కేసుల్లో ఉన్నవారు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట కేసముద్రం ఎస్ఐ ఎం.వంశీధర్, సిబ్బంది ఉన్నారు.